www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 21 డిసెంబర్ 2022

5

తిరుపతి

యువకుడు దారుణ హత్య

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : తిరుపతి నగరంలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి చింతకాయల వీధికి చెందిన అఖిల్ (22) తల్లి చనిపోవడంతో నాన్న మల్లికార్జున్ రెండో వివాహం చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో చిన్నప్పటి నుంచి అఖిల్ దగ్గర పెరుగుతున్నాడు. నాలుగేళ్ల కిందట అమ్మమ్మ కూడా చనిపోవడంతో చింతకాయల వీధిలోని నానమ్మ దగ్గరికి వెళ్ళాడు. చెడు అలవాట్లకు బానిసైన అఖిల్ అతని నానమ్మకు సరిపడలేదు. దీంతో అఖిల్ అదే ప్రాంతం లోని ఓ గదిలో ఒంటరిగా ఉంటూ పెయింటర్ పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి గదిలోకి వెళ్లిన అఖిల్ సోమవారం మధ్యాహ్నం కూడా బయటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన నానమ్మ పోలీసులకు సమాచారాన్ని అందించింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తులు అఖిల్‌ను గొంతు కోసి హత్య చేసినట్లు గుర్తించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా అఖిల్ స్నేహితులు ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి మాటామాటా పెరగడంతో అఖిల్‌ను హత్య చేసి పారి పోయారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు కావాలి

- అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలి
- ఎన్నికల అబ్జర్వర్ పి.ఎస్ ప్రద్యుమ్న

సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అబ్జర్వర్ పిఎస్ ప్రద్యుమ్న

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారు కావాలని ఎలెక్టరల్ రోల్ అబ్జర్వర్ పిఎస్ ప్రద్యుమ్న అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ప్రత్యేక ఓటర్ల సవరణ- 2023, గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గం ఎమ్మెల్సీ ముసాయిదా ఓటర్ల జాబితాపై జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, డి.ఆర్ఓ శ్రీనివాస రావు, నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి, 7 నియోజకవర్గాలకు సంబంధించి ఈఆర్ఓలతో తహశీల్దార్లు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈపి నిష్పత్తి, లింగ నిష్పత్తిపై వారంలోపు పరిశీలించి జాబితా తయారు చేయాలని సూచించారు. ఏడు నియోజకవర్గాల పట్ట భద్రులకు సంబంధించి 85566కి గాను 5671 పిఎస్ఈలలో పెండింగ్లో ఉన్న, టీచర్లకు సంబంధించిన 3975కి గాను 1303 పెండింగ్‌లో ఉన్న వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని కోరారు. రాజకీయ పార్టీలు లేవ నెత్తిన ముసాయిదా ఓటరు జాబితాలోని అభ్యంతరాలను పునఃపరిశీలించి లోపాలుంటే వాటిపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారికి వివరాలు తెలిసేలా చర్యలు తీసుకోవాల ఉన్నారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం పూర్తి స్థాయిలో చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తిరుపతి, గూడూరు, సూళ్ళూరు పేట ఆర్.డి.ఓ లు కనక నర్సా రెడ్డి, కిరణ్ కుమార్, రోస్ మాండ్, తహశీల్దార్లు, వై.ఎస్.ఆర్ పార్టీ వి.మోహన్ రెడ్డి, తెలుగు దేశం పార్టీ తరపున నరసింహ యాదవ్, కాంగ్రెస్ పార్టీ తరపున టి.వెంకటనరసింహులు, బిజెపి తరపున కె.వెంకటముని, సిపిఎం తరపున కందారపు మురళి, సిపిఐ తరపున కె.రవి, బిఎస్‌పి తరపున జి.సాయి కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు నియోజకవర్గ ఏఈ ఆర్ఓలు పాల్గొన్నారు.



రాజకీయ నాయకులు

ఎమ్మెల్యే చెవిరెడ్డి ఇంట విషాదం

- చెవిరెడ్డికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరామర్శ
- అభిమాన నేతకు అండగా కడసారి చూపుకు తరలివచ్చిన జనం
- నేడు తుమ్మలగుంట శ్మశాన వాటికలో అంత్యక్రియలు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: రాష్ట్ర ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంట విషాదం నెలకొంది. తన తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి (మణి రెడ్డి) (76) మతి చెందడాన్ని తట్టుకోలేక చెవిరెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. కొంతకాలంగా శ్వాసకోశ సమస్యతో మణిరెడ్డి బాధపడుతుండగా సోమవారం రాత్రి హఠాత్తుగా ఊపిరి పీల్చడంలో ఇబ్బంది కలిగింది. దీంతో కుటుంబ సభ్యులు స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. వైద్యసేవలు అందించే సమయానికి అపస్మారక స్థితికి చేరుకున్న మణిరెడ్డి కొంత సేపటికే మతి చెందినట్లు స్విమ్స్ వైద్యులు నిర్ధారణ చేశారు. తండ్రి మరణ వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి ఒక్కసారిగా కుప్ప కూలి కన్నీరు పెట్టుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీసీసీ కార్యదర్శిగా పనిచేసిన మణిరెడ్డి రాజకీయంగా తన కంటూ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. అకస్మాత్తుగా ఆయన మరణం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఎమ్మెల్యే చెవిరెడ్డికి పితృ వియోగం కలగడం పట్ల సినీ, రాజకీయ, వ్యాపారరంగాలకు చెందిన పలువురు ప్రముఖులు వ్యక్తిగతంగాను, ఫోన్ ద్వారా పరామర్శించారు.

ఇద్దరు ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పరామర్శ

చెవిరెడ్డి తండ్రి మరణించినట్లు తెలుసుకున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, కె.చంద్రశేఖర్ రావులు చెవిరెడ్డిని ఫోన్‌ద్వారా పరామర్శించారు. అలాగే మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు చెవిరెడ్డికి ధైర్యం చెప్పి ఆయన తండ్రి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అలాగే సీఎం జగన్మోహన్ రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ, సతీమణి వైఎస్.భారతి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, సలహాదారు సజ్జల రామకష్ణ రెడ్డి, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డిలు ధైర్యం చెప్పారు.



అభిమాన నేతకు అండగా తరలివచ్చిన జనం..

చంద్రగిరి నియోజకవర్గం నుంచి అశేష ప్రజాదరణ పొందిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంట విషాదం చోటుచేసుకున్న విషయం తెలుసుకున్న అక్కడి జనం తండోప తండాలుగా తరలి వచ్చారు. తమ అభిమాన నేతకు అండగా ఉంటామన్న ధైర్యం చెబుతూ ఆయన తండ్రి పార్థివ దేహానికి అశ నివాళులు అర్పించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నిరంతరాయంగా జనం తరలి వస్తుండటంతో మౌలిక వసతులు కల్పించారు. సినీనటుడు మోహన్‌బాబు చెవిరెడ్డి ఇంటికి చేరుకుని మణిరెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం చెవిరెడ్డితో పాటు కుటుంబ సభ్యులు అందరినీ కలసి ధైర్యం చెప్పారు. వైసిపి ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, రవీంద్ర రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జయదేవ నాయుడు, మోహన్, జీవీ శ్రీనాథరెడ్డి, తాటిపర్తి చెంచు రెడ్డి, ఎస్సీవీ నాయుడులతో పాటు జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, ఆర్డీవో కనక నరసారెడ్డి, టీటీడీ జేఈవో సదాభార్గవిలు అంజలి ఘటించారు. వీరితో పాటు తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నగరి, పీలేరు పూతలపట్టు నియోజకవర్గాల నుంచి వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నేతలు చెవిరెడ్డి ఇంటికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు.

నేడు అంత్యక్రియలు

తుమ్మలగుంట స్మశాన వాటికలో బుధవారం చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి అంత్య క్రియలు జరుగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల మధ్య దహనక్రియలు జరుగనున్నాయి.

చెవిరెడ్డి తండ్రి మృతికి రాంప్రసాద్ రెడ్డి నివాళి

పుత్తూరు టౌన్ : తిరుపతి జిల్లా రాష్ట్ర ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి (76) సోమవారం అర్ధరాత్రి మృతి చెందడంతో రాష్ట్ర మంత్రి రోజా సోదరుడు వైరాం ప్రసాద్ రెడ్డి నగిరి నియోజకవర్గం వైసీపీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు మున్సిపాలిటీ ఛైర్మన్ ఏ.హరి, కౌన్సిలర్ నరసింహారావు, మోహన్ రెడ్డి మునెయ్య, దిలీప్ కుమార్, ప్రజాప్రతినిధులు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న రాంప్రసాద్ రెడ్డి

మూడు సంఘటనల్లో 127 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

- 6 ద్విచక్ర వాహనాలు సీజ్
- 15 మంది స్మగ్లర్ల అరెస్టు

ఎర్రచందనం స్వాధీనం, స్మగ్లర్ల అరెస్టు వివరాలను తెలుపుతున్న ఎస్పీ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం) : తిరుపతి జిల్లా పరిధిలో టాస్క్‌ఫోర్సు చేపట్టిన దాడుల్లో మూడు ప్రాంతాల్లో 127ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 15మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, వీరి నుంచి 6 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు కర్నూలు రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం నుంచి కూంబింగ్ ఆపరేషన్లు చేపట్టారు. శ్రీకాళహస్తి రేంజ్ రాగిగుంట సెక్షన్ ఎస్.రామాపురం రిజర్వాయరు సమీపంలో కొంత మంది ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపించారని తెలిపారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి దుంగలు పడేసి పారిపోయే ప్రయత్నం చేశారని అయితే 8 మందిని పట్టుకోగలిగినట్లు తెలిపారు. వీరి నుంచి 74ఎర్రచందనం దుంగలు, మూడు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కీలక వ్యక్తి అయిన బోడుగు రాజారావును విచారించగా, చెన్నైలోని మురుగన్ అనే వ్యక్తి ఎర్రచందనం దుంగలు కోరినట్లు తెలిపారు. ఆయనకు ఈ దుంగలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రామాపురం గ్రామానికి చెందిన రాజారావు(52)తో పాటు శ్రీకాళహస్తి మండలానికి చెందిన టీ.హరి (32), కే.చంద్రశేఖర్ (34), డీ.హరికృష్ణ(32), నారాయణవనంకు చెందిన కే.లోకయ్య (33), పిచ్చాటూరు మండలానికి చెందిన మహ్మద్ ఖాదిర్ (26), అరంబాకం వెంకటేష్ (52)లను అరెస్టు చేశారు. ఇందులో ఫారెస్టు వాచర్ తిరుపాల్ హస్తం ఉండగా అతను పారిపోయాడు. మరో సంఘటనలో కృష్ణాపురం బీట్ ఏర్పేడు అటవీ ప్రాంతంలో చిందేపల్లి తాటిచెట్లు సమీపంలో కొంత మంది నిలుచుకుని ఉండగా గమనించారు. వారిని సమీపించడంతో పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఇద్దరిని పట్టుకున్నారు. వీరిని నాగలాపురంకు చెందిన దొరైరాజ్ ప్రభు (34), కరకంబాడికి చెందిన వేముల నారాయణ (48)లుగా గుర్తించారు. వీరి నుంచి 28ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. మూడవ కేసులో కేవీబీపురం వెళ్లు మార్గంలో ఎస్ఎల్‌పురం గ్రామం వెనుక ఉన్న అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా, మోటారు సైకిళ్లపై కొంత మంది అక్కడ గుమికూడి ఉన్నారు. వీరిని సమీపించడంతో పారిపోయే ప్రయత్నం చేశారు. వీరి సమీపంలో దాచి ఉంచిన 25ఎర్రచందనం దుంగలతో పాటు రెండు ద్విచక్ర వాహ నాలను స్వాధీనం చేసుకున్నారు. వీరిని పిచ్చాటూరు మండలానికి చెందిన షరీఫ్ (29), బీ.అనిల్ (24), కేవీబీపరంకు చెందిన వి.ప్రేమ్ కుమార్ (26), వి.శివకుమార్ (22), రామ చంద్రాపురం మండలం మద్దేరి తులసిరామ్ (32)లను అరెస్టు చేశారు. మొత్తం 127ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకు న్నామని, వీటి విలువ రూ.కోటి ఉండవచ్చునని ఎస్పీ చక్రవర్తి తెలిపారు. 15మంది స్మగ్లర్లను అరెస్టు చేశామని, వీరి నుంచి 06 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులను టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్లో నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఆపరేషన్లో పాల్గొన్న అధికారులు, సిబ్బందికి ఎస్పీ రివార్డులు ప్రకటించారు.

కేంద్ర సంస్థ మెంబర్‌గా తిరుపతి ఎంపి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కేంద్రసంస్థ మెంబర్‌గా ఎన్నుకున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఔషధ శాస్త్రాలలో అధునాతన అధ్యయనాలు, పరిశోధనలకు అత్యుత్తమ కేంద్రంగా మారాలనే లక్ష్యంతో ఏర్పాటు చేయబడిన మొదటి జాతీయ స్థాయి సంస్థ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్. ఇది భారత ప్రభుత్వంలోని రసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖ, ఫార్మాస్యూటికల్స్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయబడిన స్వయం ప్రతిపత్త సంస్థ. ఈ సంస్థ దేశంలోనే కాకుండా ఆగ్నేయాసియా, దక్షిణాసియా, ఆఫ్రికా దేశాలకు కూడా ఔషధశాస్త్రాలు సంబంధిత రంగాలలో సహకారం అందించడానికి రూపొందించబడింది. ఈ సంస్థకు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కౌన్సిల్ మెంబర్‌గా ఎన్నుకోబడ్డారు. ఈసందర్భంగా ఎంపీ గురుమూర్తి తనకు అరుదైన అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఈసంస్థకు మెంబర్‌గా ఎన్నికవడానికి సహ కారం అందించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, రాజ్యసభసభ్యులు విజయసాయి రెడ్డికి కతజ్ఞతలు తెలియజేశారు.

నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ ఏర్పాటు చేయండి

తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి తన నియోజకవర్గ పరిధిలో అభివద్ధి చేసేందుకు పార్లమెంట్ సమావేశాలను చక్కగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఐఐటీ, ఐషర్, ఇంర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీ (ఐఐడీటీ) తదితర జాతీయ ప్రాధాన్యం గల విద్యాసంస్థలకు తిరుపతి కేంద్రమైంది. అలాగే ఏడు విశ్వ విద్యాల యాలు, వైద్యశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలతో తిరుపతి ఎడ్యుకేషన్ హబ్‌గా తయారైంది. ఈ నేపథ్యంలో తిరుపతిలో నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని సోమవారం లోక్‌సభ సమావేశాల్లో డాక్టర్ గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఫోరెన్సిక్ నిపుణుల కొరత తీర్చే అవకాశం లభిస్తుంది. అలాగే లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల డిమాండ్లను తీర్చడానికి ఈ విశ్వవిద్యాలయం దోహదపడు తుందని ఆయన కేంద్ర ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లారు. నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ, దాని అనుబంధ క్యాంపస్‌ను తిరుపతిలో నెలకొల్పడం ద్వారా ఫోరెన్సిక్ సైన్సెస్ ప్రపంచీకరణ ప్రక్రియలో, దేశంలోని శాస్త్రీయ పరిశోధనాత్మక నిపుణులను వెలికి తీయొచ్చని కేంద్ర ప్రభుత్వానికి వివరించారు.

సప్తగిరి నగర్‌లో తవ్విన రోడ్లను పూడ్చాలి

మునిసిపల్ అడిషనల్ కమిషనర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి 43వ డివిజన్ సప్తగిరి నగర్‌లో రెండు సంవత్సరాల క్రితం తవ్వి వదిలేసిన రోడ్లను బాగు చేయాలని కోరుతూ మంగళవారం సిపిఎం నేతలు అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం మాట్లాడుతూ అమృత పథకం కింద ఇంటింటికి నీటి కుళాయిలు బిగించడం కోసం గత రెండు సంవత్సరాల క్రితం సప్తగిరి నగర్‌లో ఉన్న వీధులన్ని తవ్వి వదిలేశారని, ఇప్పటివరకు ఆ రోడ్లను బాగుచేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో అనేకసార్లు స్పందనలో ఈ సమస్యను చెప్పినా పరిష్కారం కాలేదన్నారు. వెంటనే తవ్వి వదిలేసిన రోడ్లను బాగు చేయాలని కోరారు. కమిషనర్ వెంటనే స్పందించి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సిపిఎం నేతలు ఎండి శ్రీనివాసులు, ఏ.రాధాకృష్ణ, టీ.రామకృష్ణ, వి.మోహన్ రావు ఉన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...

వ్యవసాయ కళాశాల వజ్రోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం పూర్వ విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది. ఈ సందర్భంగా వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా కళాశాల పూర్వపు, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది నిర్వహించిన వాకతాన్ కార్యక్రమాన్ని ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం వద్ద ప్రారం భమైన ఈ వాకతాన్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ ఇన్స్టిట్యూట్, హార్టికల్చర్ గార్డెన్ మీదుగా ప్రధాన గేటు వరకు సాగింది. వాకతాన్ మధ్యలో విద్యార్థులు నిర్వహించిన ఫ్లాష్ మాబ్ ఆకర్షణగా నిలిచింది. ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ ఎ.ప్రతాప్ కుమార్ రెడ్డి అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు, విశ్రాంతి అధ్యాపకులు సమావేశమై శ్రీవేంకటేశ్వర వ్యవ సాయ కళాశాల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం మరింత పటిష్టం కావాలని తీర్మానించి ప్రత్యేకంగా రూపొందించిన పూర్వ విద్యార్థుల సంఘం లోగోను ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఏ విష్ణువర్ధన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా తిరుపతి వ్యవసాయ కళాశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల కోసం పూర్వ విద్యార్థుల అతిథి గృహాన్ని నిర్మిం చాలని తీర్మానించారు. అందుకోసం ప్రాథమికంగా కోటి రూపాయల వరకు పూర్వ విద్యార్థులు తమ విరాళాలను ప్రకటించారు. ఈ సమావేశంలో శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేటెడ్ డాక్టర్ ఆర్‌పి వాసంతి, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ పి రాజశేఖర్, పెరుమాళ్ళపల్లి పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ హేమంత్ కుమార్, విద్యార్థుల సంఘం నాయకులు, అధ్యాపకులు, విశ్రాంత ఆచార్యులు పాల్గొన్నారు.

తిరుపతిలో అట్టహాసంగా

అమరరాజా 37వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్, రేణిగుంట: అమర రాజా వ్యవస్థాపక 37వ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా అమరరాజా గ్రూప్ ఛైర్మన్, కో-ఫౌండర్ జయదేవ్ గల్లా మాట్లాడుతూ ఆవిష్కరణ, శ్రేష్టత, వ్యవస్థాపకత, అను భవాలు, బాధ్యత అనే కీలకమైన ఐదు విలువలపై ఆధారపడి ప్రతి సంవ త్సరం ఈ ప్రాంతంలోని వ్యాపారవేత్తలు, సంస్థలకు అవార్డులు అంద జేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించేందుకు సంతోషిస్తున్నామని తెలిపారు. ఈ అవార్డులు నగదు బహుమతితో పాటుగా తమ కంపెనీ సీనియర్ లీడర్ల మెంటార్‌షిప్‌తో వస్తాయని అన్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలలోని కొన్ని ట్రాఫిక్ ఐలాండ్‌లు, కొన్ని బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ భాద్యత కూడా తాము తీసుకోబోతున్నట్లు తెలియజేశారు. అలాగే నిరుపేద వర్గాలకు చెందిన 10, 12వతరగతి పరీక్షల్లో అత్యున్నత ప్రదర్శన కనబరిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. కంపెనీ పరిసరప్రతాలలో, కంపెనీ నిత్యావసర కార్యక్రమాలలో సహాయ సహకారాలు అందిస్తున్న కొంతమందిని సత్కరించారు. అమరరాజా గ్రూప్ ద్వారా మరెన్నో ప్రతిష్టాత్మక నూతన వ్యాపార కార్యక్రమాలను ప్రకటించారు. ఈ వేడుకలలో అమర రాజా ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.రామచంద్ర గల్లా, గల్లా అరుణ కుమారి, డాక్టర్ రమాదేవి గౌరినేని, హర్షవర్ధన్ గౌరినేని, విక్రమాదిత్య గౌరినేని ఉద్యోగులు పాల్గొన్నారు.

సైబర్ ఆన్‌లైన్ నేరగాళ్ల ఆటకట్టు

- పోగొట్టుకున్న సొమ్మును తిరిగి అప్పగించిన పోలీసులు
- ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : యశస్విని తిరుపతిలో నివాసం ఉంటూ సాఫ్ట్వేర్ ఉద్యోగం చేస్తారు. తన ఇన్‌స్టాగ్రామ్ కు సైబర్ నేరగాళ్లు ఒక మెసేజ్‌ను ఆగస్టు నెలలో పంపించారు. 18,000 వెలు పంపిస్తే 8 లక్షలు వస్తాయని బిట్ కాయిన్ మీద ఇన్వెస్ట్ చేయమని నమ్మ బలికారు. సైబర్ నేరగాళ్ల మాటలను నమ్మి మొదట రూ.18వేలుతో పాటు తరువాత రూ.80 వేలను పంపారు. అలా తర్వాత సైబర్ నేరగాళ్ళ ప్రాసెసింగ్ ఫీజు అని చెప్పి మళ్లీ కొద్దీ కొద్దిగా మొత్తం రూ.7.8 లక్షలను తన దగ్గర నుంచి తీసుకున్నారు. తర్వాత సైబర్ నేరగాళ్లు శాశ్వతంగా వారి ఫోన్లను స్విచాఫ్ చేశారు. విషయం గ్రహించి అప్పటికే పూర్తిగా మోసపోయామని తెలుసుకున్న యశస్విని కంగారుపడి వెంటనే గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ సిఐని సంప్రదించగా సీఐ జరిగిన విషయాన్ని గ్రహించి జిల్లా ఎస్పీకి తెలియపరచి వారి సూచనలతో తిరుపతి సైబర్ ల్యాబ్ టీమ్ వారిని సంప్రదించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబర్ ల్యాబ్ వారి సహకారంతో సైబర్ నేరగాళ్ల అకౌంట్లను కనుక్కొని వాళ్ళ అకౌంట్లను ఫ్రీజ్ చేయడంతో పాటు ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల ఆటలను కొనసాగకుండా కట్టడి చేశారు. తదుపరి బాధితురాలు పోగొట్టుకున్న సొమ్మును పూర్తిగా సైబర్ నేరగాళ్ల బ్యాంక్ అకౌంట్ నుండి రాబట్టి కోర్టు ద్వారా బాధితరాలు సొమ్మును వారి అకౌంట్లో జమ చేశారు. మంగళవారం యశస్విని వారి కుటుంబ సభ్యులతో జిల్లా ఎస్పీ .పి. పరమేశ్వర రెడ్డికి పుష్పగుచ్ఛమిచ్చి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే గాజుల మడ్యాం సీఐ ఆరోహణ రావుకి సైబర్ ల్యాబ్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అరణియార్ అభివృద్ధి పనులు భేష్

తమిళనాడు ఇరిగేషన్ శాఖ ఎస్ఈ ముత్తయ్య

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు అరణియార్ ప్రాజెక్టు అభివృద్ధి పనులు చేపట్టడం బాగుందని తమిళనాడు ఇరిగేషన్ శాఖ పాలారు సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ ఎ.ముత్తయ్య అన్నారు. మంగళవారం తమిళనాడు ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి ఎస్ఈ ముత్తయ్య అరణియార్ జలాశయాన్ని సందర్శించారు. ఇరిగేషన్ అధికారుల బృందం మొదటగా ప్రాజెక్టు రేడియల్ స్పిల్వే గేట్ల వద్దకు చేరుకొని గేట్ల పనితీరు, గేట్ల నిర్మాణం, నీటి విడుదల, ప్రస్తుత ప్రాజెక్టులో నీటి సామర్థ్యం, తాజానీటి మట్టం, ప్రాజెక్టు ప్రధాన కాలువలు, అనుబంధ చెరువులు, ఆయకట్ట వంటి అంశాలను అక్కడే ఉన్న అరణియార్ ఏఈ ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేశారు. ప్రాజెక్టు ఏఈ లోకేశ్వర్ రెడ్డి ప్రాజెక్టు పాత గేట్లు 2005లో పగిలిపోవడంతో అప్పటి ప్రభుత్వం 23 కోట్లు మంజూరు చేసి ప్రస్తుతం ఉన్న అధునాతన రేడియల్ స్పిల్వే గేట్లు, ప్రధాన కాలువలు లైనింగ్, అక్విడెక్ పనులు చేపట్టారన్నారు. పాతగేట్లు కాలం చెల్లిపోవడంతో సిమెంట్ కాంక్రీట్‌తో పూర్తిగా మూసివేశామన్నారు. ప్రస్తుతం 35 కోట్లు జైకా నిధులతో ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు జరుగుతుందని, మరో రూ.2 కోట్ల టూరిజం పనులకు టెండర్లు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రాజెక్టుకు అనుబంధంగా 9 చెరువులు ఉన్నాయని, ప్రధాన కాలువల ద్వారా వాటికి నీరు సరఫరా అవుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 31 అడుగులు (1.851 ఎంసీఎఫ్‌ఎ) మంగళవారం ఉదయానికి 30 అడుగులకు నీటిమట్టం చేరుకుందని ఏఈ వివరించారు. ప్రస్తుత నీటి మట్టం జైకా నిధులతో చేపట్టే పనులు, టూరిజం పనుల వివరాలను తమిళనాడు అధికారులు ఆసక్తిగా అడిగి తెలుసుకోవడం విశేషం. ఈ పనులన్నీ పూర్తైతే జలాశయం అందంగా రూపుదిద్దుకుంటుందని ఎస్ఈ ముత్తయ్య అభిప్రాయపడ్డారు. చివరగా పగిలిపోయిన పాత గేట్లను అధికారుల బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఇరిగేషన్ శాఖ చెన్నై డివిజన్ అరణియార్ బేసిక్ ఈఈ జయకుమారి,పొన్నేరి ఏఈఈ వెత్రివేలన్, జేఈలు జయగురు, ప్రత్వి బాలసుందర,కణ్ణన్, శరవణన్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో వంచన

- తల్లినిచేసి..పెళ్లి చేసుకుంటానంటూ మోసం
- నిందితుడికి ప్రభుత్వ పెద్దల అండ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

చదువుకుంటున్న అమ్మాయితో ప్రేమపేరుతో వెంట పడ్డాడు. మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. ఆ విద్యార్థి గర్భిణి అని తెలిసి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, రహస్యంగా అబార్షన్ చేయించాడు. తీరా కులాలు వేరు, ఇంట్లో వాళ్లు ఒప్పుకోలేదని, మరొక అమ్మాయితో పెళ్లికి సిద్ధపడ్డాడు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కటకటాల పాలయ్యాడు. ప్రభుత్వ పెద్దల అండ దండలు ఉండంతో కేసు నుంచి బయటపడేందుకు పైరవీలు చేస్తుండడం గమనార్హం. తనకు న్యాయం చేయాలని బాధితురాలు విలపిస్తోంది.

నారాయణవనం కృష్ణంరాజుకండ్రిగలో ఉంటున్న ఎస్‌సి కులానికి చెందిన విద్యార్థిని(20), నైనారు కండ్రిగకు చెందిన భరత్‌రెడ్డి(25) రెండేళ్ల క్రితం ప్రేమిస్తున్నాని వెంటపడ్డాడు. ఏడాది పాటు ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని తిరిగారు. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి లోబరుచుకుని శారీరంగా లొంగదీసుకున్నాడు. దీంతో ఆ విద్యార్థిని గర్భిణి అయింది. ఏడు నెలల గర్భిణిగా ఉన్న బాధితురాలు తనను పెళ్లి చేసుకోవాలని, న్యాయం చేయాలని వేడుకుంది. ఈ ఏడాది జూలై 13వ తేది తిరుపతి బస్టాండుకు రా పెళ్లి చేసుకుందామని నిందితుడు చెప్పాడు. అక్కడికి వచ్చిన బాధితురాలిని తన స్నేహితుడైన ప్రదీప్‌రెడ్డి(ఓ ప్రముఖ ఆసుపత్రిలో ఉద్యోగి)తో వచ్చి, మనిద్దరం పెళ్లి చేసుకుందామన్నాడు. ప్రదీప్‌రెడ్డి సైతం తమకు పెళ్లి అయిన తర్వాత తానే కాపురం పెట్టిస్తానని ప్రమాణం చేశారు. ప్రస్తుతం నువ్వు బలహీనంగా ఉన్నావు ఆసుపత్రికి వెళ్లి మంచి ట్రీట్‌మెంట్ తీసుకుందామని నమ్మించాడు. ప్రదీప్‌రెడ్డి తాను పని చేసే ఆసుపత్రిలో కాకుండా అబ్బన్న కాలనీలోని ఓ ప్రముఖ ఆసుపత్రికి తీసుకెళ్లి ఇంజక్షన్ ఇచ్చారు. మత్తులోకి వెళ్లిన తర్వాత అబార్షన్ చేయించారు. బాధితురాలి ప్రమేయం లేకుండా ఏడున్నర నెలల బిడ్డను ఆబార్షన్ చేయించారు. బాధితురాలు స్పృహలోకి వచ్చిన తర్వాత తన బిడ్డ గురించి అడిగితే ఆసుపత్రి వర్గాలు భరత్‌రెడ్డికి అప్పగించారని చెప్పారు. తీరా భరత్‌రెడ్డిని ప్రశ్నిస్తే గర్భిణి కావడంతో తమ అమ్మవాళ్లు పెళ్లికి అంగీకరించరని, అందుకు తీయించేశానని, ఇప్పుడు మనం పెళ్లి చేసుకోవచ్చని మరోసారి నమ్మించాడు. అప్పటి నుంచి గత ఐదు నెలలుగా అదుగో ఇదుగో అంటూ కాలయాపన చేస్తూనే ఉన్నాడు. పైగా నిందితుడు మరో అమ్మాయితో పెళ్లికి సిద్ధం కావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. స్థానిక పోలీసులు స్పందించకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో జిల్లా ఎస్పిని ఆశ్రయించి, దిశా పోలీసుల ద్వారా గత నెల 3వ తేదిన కేసు నమోదు చేశారు. ఎట్టకేలకు నింది తుడిని అరెస్టు చేసి, తిరుపతి సబ్‌జైల్‌కు తరలిం చారు. కానీ ఆయనికు సహకరించిన ప్రదీప్‌రెడ్డి మరికొంత మందిని ఇప్పటికీ అరెస్టు చేయలేదు.

అధికార పార్టీ అండదండలు

నిందితుడు జైల్లో ఉన్నాడు. దీనిపై పూర్తి విచారణ చేయాలని ఎస్పి దిశా పోలీసు స్టేషన్ డిఎస్‌పిని ఆదేశించాడు. విషయం తెలుసుకున్న నిందితుడి కుటుంబ సభ్యులు పైరవీలు ప్రారంభించారు. జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రముఖ వ్యక్తి అండదండలతో పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో తనకు న్యాయం చేయాలని బాధితురాలు మీడియాను ఆశ్రయించింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధితురాలుకు సరైన న్యాయం చేయాలని మహిళా సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు, మానవ హక్కుల సంఘాలు కోరుతున్నాయి.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు

ప్రజాశక్తి - కోట: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం కోట మండలంలోని శ్యామసుందరపురం గ్రామంలో పర్యటించారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ అర్హులైన వారికి వస్తున్నాయా లేదా అని ఆరా తీశారు. అంతేకాకుండా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా తక్షణమే పరిశీలించి సమస్య పరిష్కారం చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి, కోట బిట్ 2 ఎంపీటీసీ మొబిన్ భాషా, వైసీపీ సీనియర్ నాయకులు నరమాల వెంకట రమణయ్య, తహశీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని తదితర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

అమరావతికి సహకరించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఏపీకి ఏకైక రాజధాని అమరావతే ఉండేలా పార్లమెంట్ లో ఒత్తిడి తేవాలని టీడీపీ మహిళా విభాగం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉష విజ్ఞప్తి చేశారు. అమరావతి రైతులు దేశ రాజధాని న్యూఢిల్లీలో చేస్తున్న ఉద్యమంలో చక్రాల ఉష పాల్గొన్నారు. అనంతరం అమరావతి రైతులతో కలిసి న్యూఢిల్లీలో టీడీపీ ఎంపీ కింజరపు రామమోహన్ నాయుడు, వైసీపీ ఎంపీ రఘు రామకృష్ణం రాజును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని దుశ్శాలువతో సన్మానించారు. అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని కోరుతూ అమరావతి రైతులకు సంఘీభావం తెలియజేశారు.

'మూడేళ్లు వేధించి ఇప్పుడు సంబరాలా!'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా మూడేళ్లు ముప్పతిప్పలు పెట్టి ఇప్పుడు పంపిణీ పేరిట రాష్ట్ర ముఖ్యమంత్రి సంబరాలు నిర్వహించడం సిగ్గుచేటని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బీసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉమేష్ రావు మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఉండటానికి ఇల్లు లేకుండా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న ప్రజల కష్టాలను సైతం లెక్కచేయకుండా వారిని ముప్పతిప్పలు పెట్టి, తొంభై శాతం పూర్తైన టిడ్కో ఇళ్లు ఆయా లబ్ధిదారులకు ఇవ్వకుండా తాత్సారం చేసి, ఇప్పుడు వాటి పూడిగా ఇళ్ల పంపిణీ పేరుతో సంబరాలు చేసుకుంటున్న జగన్మోహన్ రెడ్డిని దిగజారుడు రాజకీయాలని ఉమేష్ ఎద్దేవా చేశారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి -బాలాయపల్లి : పార్లమెంటు సమావేశాలలోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాజీ ఎంఎస్ఎఫ్ ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షులు మంగళ పూరిసురేష్ మాదిగ తహశీల్దారు కార్యాలయం వద్ద ఎంఆర్పిఎస్, ఎంఎస్ఎఫ్ వృహత్తర ఉద్యమం మండపుత్ర మాది ఆదేశాల మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఎంఎస్ఎఫ్ నాయకులు అక్కుర్తి రమయ్య, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు వాన రాజకుమార్ మాదిగ, మంగళపూరి వెంకటేశ్వర్లు మాదిగ, వల్లిపాటి పవన్ మాదిగ, పల్లిపాటి ఈశ్వరయ్య మాదిగ, పెంచలయ్య మాదిగ పాల్గొన్నారు.

పద్మావతి మహిళా వర్సిటీలో..

మేనేజ్‌మెంట్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఎంసీఏ, ఎంబీఏ, మీడియా మేనేజ్మెంట్ వంటి పలు కోర్సులలో స్పాట్ అడ్మిషన్లను డిసెంబర్ 23వ తేదీన ఆయా సంబంధిత విభాగాలలో నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతులు ఆచార్య ఉషారాణి విజయలక్ష్మి శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఐసెట్ 2022లో అర్హత సాధించిన విద్యార్థినిలు ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆయా సంబంధిత ఎంసీఏ, ఎంబీఏ, ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్ కోర్సులకు సంబంధించి విభాగాలలో హాజరుకావాలని వెల్లడించారు. స్పాట్ అడ్మిషన్ల ద్వారా సీట్ తీసుకున్న వారికి ఫీజు రియంబర్స్‌మెంట్ వసతి వర్తించదన్నారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత విభాగాల కార్యాలయాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లను సమర్పించి చేరవచ్చునన్నారు.

దివ్యాంగులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- నాయుడుపేట: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగులకు ఉచిత సహాయక పరికరాలను అందించేందుకు సమగ్ర శిక్షసహిత విద్యా విభాగం జెఈ కో-ఆర్డినేన్స్ రామచంద్ర రెడ్డి, మండల విద్యా శాఖ అధికారి ఎస్.కోమల దేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య నిర్ధారణ శిబిరంలో దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రాజేష్ ఇఎన్‌టీ, డా"పి.ఉదయ్‌కిరణ్ న్యూరో ఫిజియాలజిస్ట్ వారితోపాటు ఫిజియో థెరపిస్ట్, ఆండ్రియాలజిస్ట్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలి

టిడిపి నాయకుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత శాంతిభద్రతలు క్షీణించాయని, రాష్ట్ర ప్రజలకు భద్రత కల్పించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం తాతయ్య గుంట దేవస్థానం ఆవరణంలో వినోద్ నిరసన కార్యక్రమం చేశారు. స్థానిక గంగమ్మ గుడి ముందు 1000 కన్నుల దుత్త ఎత్తుకొని గంగమ్మ తల్లిని ఈ రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడమని కోరుతూ ప్రార్థించారు. గంజి సుధాకర్ రెడ్డి, సుబ్బు యాదవ్, దేపూర్ నాగ ప్రతాప్, శ్రీలక్ష్మి, జగన్నాథం, సుజాతమ్మ, మునిరాజా, దామా మురళీ, సావిత్రమ్మ, మల్లికా, పార్వతమ్మ, రంగారెడ్డి,మధు, గంగమ్మ గుడి దగ్గర వెయ్యి కాళ్ల దుత్తలతో రాష్ట్రం బాగుండాలని అందరం మొక్కు తీర్చుకున్నారు

సీఎం జన్మదినాన్ని రాజకీయం చేయడం తగదు

వైఎస్సార్ విద్యార్థి, యువజన సంఘం నేతలు

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్ర ప్రజలందరి చేత అభిమానంతో ఎన్నుకోబడ్డ నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్వీయూలో నిర్వహించుకోవడానికి రాజకీయం చేయడం తగదని వైయస్సార్ విద్యార్థి యువజన విభాగం నేతలు డాక్టర్ బి.ఓబుల్ రెడ్డి, లెక్కల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎస్వీయూ పరిపాలన భవనం ఎదుట పత్రిక విలేకరులతో మాట్లాడుతూ పేద విద్యార్థులు జగనన్న జన్మదినాన్ని గొప్పగా నిర్వహించుకోవడం కూడా కొన్ని పత్రికలకు, నేతలకు వంట పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ విద్యార్థి సంఘం యూనివర్సిటీ అధ్యక్షులు మణి, విద్యార్థి సంఘం నేతలు, ప్రదీప్, ప్రశాంత్, భాష, హేమంత్, మహేంద్ర నాయక్, రామలింగారెడ్డి, శ్రీనివాసులు, శివ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎస్వీయూ మహిళల జట్టు ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఏఎంఈఐటి వర్సిటీలో నిర్వహించే దక్షిణాది రాష్ట్రాల ఇంటర్ జోన్ కబడ్డీ పోటీలకు ఎస్వీయూ మహిళల జట్టును ఎంపిక చేసినట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎం. శివశంకర్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కబడ్డీకి సంబంధించిన డ్రస్సులు, ఇతర మెటీరియల్ వర్సిటీ ఇంజనీర్ వి.రవీంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. మొత్తం 12 మంది సభ్యుల జట్టును ఎంపిక చేశారు. మహిళల కబడ్డీ జట్టు కోచ్‌గా అకాడమిక్ కన్సల్టెంట్ గోవర్ధన్, మేనేజర్‌గా శరత్ కుమార్ నాయక్‌లను పంపించడం జరుగుతుందన్నారు.

ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించబడే శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో "వినియోగదారుల కమిషన్లలో కేసులను సమర్థవంతంగా పరిష్కరించడం " అనే అంశంపై ఇంగ్లీష్ తెలుగు భాషలలో వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.నారాయణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఉదయం 10.30కు నిర్వహిస్తారని తెలిపారు. మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకున్న వారికి రూ.3000, రూ.2000, రూ.1500 నగదు బహుమతులు ఉంటాయని తెలిపారు. 24వ తేదీన వినియోగదారుల దినోత్సవ సభలో బహుమతులు అందజేస్తారని అన్నారు.

పచ్చదనమే ప్రగతికి మెట్లు : నేదురుమల్లి

శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: పచ్చదనమే ప్రగతికి మెట్లనీ, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తిరుపతి జిల్లా వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా కొండ చుట్టుకు వెళ్లే దారిలో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్ రెడ్డి ఆధ్వర్యంలో 1008 మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ముఖ్యఅతిథిగా నేదురుమల్లి హాజరై మొక్కలు నాటారు. స్వామి అమ్మవార్లతోపాటు గిరి ప్రదర్శనకు వచ్చే భక్తులకు ఈ చెట్లు ఎంతగానో స్వాంతన చేకూరుస్తాయని నేదురు మల్లి అన్నారు. అంతకుముందు స్థానిక నవరత్నాల గుడి వద్ద భారీ కేక్ కట్ చేసి జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీ నివాసులు, ఓడూరు గిరిధర్ రెడ్డి, పగడాల రాజు, వయ్యాల కృష్ణారెడ్డి, నంద,సెన్నిరు కుప్పం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి : మొక్కల పెంపకం ఒక యజ్ఞంలా ఉండాలని ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమం అటవీశాఖ ఆధ్వరంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 23 శాతం మాత్రమే ఉన్న అటవీ విస్తీర్ణాన్ని 33 శాతం పెంచే దిశగా అందరం ప్రయత్నం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం చెట్లు నాటారు.

యర్రావారిపాలెం: అటవిశాఖ భాకరాపేట రేంజ్ ఆధ్వర్యంలో జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కస్తూరిబా స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్కూలు ఆవరణంలో విద్యార్థులచే సుమారు 200 మొక్కలు నాటించారు.

పుత్తూరు టౌన్: మండలంలోని గోపాల కృష్ణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఫారెస్ట్ అధికారి చంద్రశేఖర్ రాజు ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు గ్రామ సర్పంచి వేలాయుధం ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణంలో చెట్లను నాటారు

బిఎన్‌కండ్రిగ: మండలంలోని పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో జొన్నల గోపాల్ రెడ్డి, అటవీ అధికారులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ చెట్లు పెంచడం ద్వారా కాలుష్య నియంత్రణతో పాటు ప్రజా ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు.

శ్రీకాళహస్తిరూరల్: మండలంలోని ముచ్చువోలు పంచాయతీలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, వాంపల్లి ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాప్ డైరెక్టర్ రాఘవరెడ్డి పాల్గొన్నారు. జగనన్న పచ్చ తోరణం కార్యక్రమం ద్వారా రెండు పాఠశాలల్లో 250 మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

వరదయ్యపాలెం: మొక్కలు నాటండి కాలుష్యాన్ని నియంత్రించండని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

శ్రీకాళహస్తిలో రూరల్‌లో..

పిలుపునిచ్చారు. మండలంలోని సేయింటన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఏర్పాటు చేసిన జగనన్న పచ్చతోరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి జగనన్న పచ్చ తోరణం కార్యక్రమం ఏర్పాటుచేసిన ఫారెస్ట్ అధికారి ఫాదర్‌జాన్ పీటర్‌ని అభినందించారు.

పెళ్లకూరు: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, జెడ్పిటిసి నన్నం ప్రెస్కిల్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటు కార్యక్రమం ప్రారంభమైంది.పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తిచేయాలని తద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా వ్యవహారించాలని తెలియజేశారు.

కోట: మండలంలోని చిట్టేడు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లలో జగనన్న పచ్చతోరణం కార్యక్రమంలో భాగంగా ఫారెస్ట్ అధికారులు, నాయుడుపేట రేంజ్ ఎఫ్ ఆర్ఓ కేసి సునీల్ కుమార్, కోట రేంజ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎన్ భాగ్యమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరమణయ్య, స్కూల్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, విద్యార్థులు కలిసి పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు.

పాకాల: మండలంలోని స్థానిక గ్రంథాలయంలో మంగళవారం ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి తాళ్ల రవీంద్రబాబు ఆధ్వర్యంలో పాకాల శాఖా గ్రంథాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించి అనంతరం చెట్లను నాటారు.

టిటిడి ఇఓ ధర్మారెడ్డి కుటుంబానికి అంతులేని విషాదం

తీవ్ర సంతాపాన్ని ప్రకటించిన సిఐటియు

ప్రజాశక్తి -తిరుమల: చెట్టంత ఎదిగిన కొడుకు... ఉన్నత చదువు... ముంబయిలో పెద్ద ఉద్యోగం... 26 సంవత్సరాల లేత వయసు ఇవన్నీ ఒక ఎత్తయితే జనవరి 26వ తేదీన పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఆ నవ యువకుడు గుండెపోటుతో మరణించడం ... ఆ విషాదం భరించనలవి కానిది... ధర్మారెడ్డి ఆయన భార్య కళ్లెదుటే తమ కన్న కొడుకు తమను వీడిపోవడం ఏ ఒక్కరూ ఊహించని విషాదం. ఆ లోటును ఏ ఒక్కరూ పూడ్చలేరు. శేఖర్ రెడ్డి ఇంట అల్లుడు కావలసిన తరుణంలో ఆ కుటుంబంలో రేగిన అలజడి సాధారణమైంది కాదు. ఈ విషాద సమయంలో సంతాపం అనే మాటలు చాలా చిన్నవి. లెక్కించలేనంత బాధ వారి హృదయాలను బరువెక్కించి ఉంటుంది. ఈ సమయంలో మనోధైర్యంతో నిలబడమని కోరడం తప్ప మనం చేయగలిగింది చాలా తక్కువ. విజ్ఞాన ప్రపంచం, సైన్సు, డాక్టర్లు ఎంతగానో పరిశ్రమించినప్పటికీ ఆ అబ్బాయి ప్రాణాన్ని నిలబెట్టలేకపోయారు. ఎక్కడో మారుమూల కర్నూలు జిల్లాలో ఒక సాధారణ కుటుంబంలో పుట్టి ఉన్నత స్థానానికి ఎదిగిన ధర్మారెడ్డి, వారి కుమారుడిపై ఎన్నో ఆశలు, ఆకాంక్షలు కలిగి ఉంటారనటంలో సందేహం లేదు... వారికి కలిగిన ఈ హఠాత్పరిణామం తీవ్రమైన మనోవేదనను మిగిల్చింది. ఆ కన్నతల్లి బాధ వర్ణించ వీలుకానిది ... సోదరుని పోగొట్టుకుని అమెరికా నుంచి వస్తున్న సోదరి విషాదం కళ్ళ ముందు కదలాడుతోంది. ఇలాంటి కష్టం మరొకరికి రాకూడదని భావించాల్సిన తరుణమిది. ధర్మారెడ్డిగారి కుటుంబం మనోధైర్యంతో ముందడుగు వేయాలని సిఐటియు తరపున కందారపు మురళి ఓ ప్రకటనలో తెలిపారు.

రైల్వే డివిజనల్ మేనేజర్‌ను కలిసిన ఆర్‌కె సెల్వమణి

ప్రజాశక్తి - పుత్తూరుటౌన్ : రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా ఆదేశాల మేరకు గేట్ పుత్తూరులోని ధర్మరాజుల గుడి వద్ద గల దారి విషయమై, గేట్ పుత్తూరు కామ్రాజనగర్ వాసుల రైల్వే నోటీసుల విషయమై రోజా భర్త సెల్వమణి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వి.ఎం.మాహీన్, పుత్తూరు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ శంకర్, పదో వార్డ్ కౌన్సిలర్ ప్రవీణ్, ముస్లిం మత పెద్దలు కామరాజు నగర్ బాధితులు అందరితో రైల్వే డివిజనల్ మేనేజర్ గణేష్‌ను కలిసి చర్చించారు. డిఆర్ఎమ్ స్పందిస్తూ త్వరలో పుత్తూరు సమస్యలపై విజిట్ చేసి ధర్మరాజుల గుడి వద్ద ఉన్న దారి విషయమై స్థలాన్ని పరిశీలించి రైల్వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ విత్ రాంప్ సౌకర్యం కల్పించడమో, లేక లిమిటెడ్ సబ్వే విత్ టు వీలర్ ఫెసిలిటీ కల్పించడమో చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఈ రైల్వే స్థలాన్ని సంబంధించి ఇష్యూ చేసిన నోటీసుల గురించి పుత్తూరు తహశీల్దార్‌తో సర్వే చేసి ప్రస్తుతం రైల్వే స్థలంలో నివసిస్తున్న వారి రికార్డును పరిశీలించి ఒక సమగ్రమైన నివేదికను అందజేయవలసిందిగా తెలిపారు. ప్రజల బాధను అర్థం చేసుకొని వెంటనే స్పందించిన మంత్రి ఆర్కే రోజాకు కామ్రాజనగర్ నివాసులు ధన్యవాదాలు తెలిపారు.

రూ.38 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూ.38 కోట్లతో మున్సిపాలిటీని మంత్రి ఆర్కే రోజా కృషితో అభివృద్ధి చేస్తామని పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక కార్వేటినగర్ రోడ్డు వైఎస్ఆర్ భవనంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఏ.హరి, వైస్ ఛైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో అజెండా కాపీని చదివి వినిపించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ ఏ.హరి కమిషనర్ కేఎంఎన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని లోతట్టు ప్రాంతంలో భవానినగర్ గేట్ పుత్తూరు రైల్వే సమీపంలో ఉన్న రోడ్ చెట్లను తొలగించి వర్షపు నీరును వెళ్లే విధంగా జెసిబి సహకారంతో తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే బడ్జెట్లో ప్రవేశపెట్టిన ద్వారా పనులను వార్డు వారీగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే పట్టణంలో పారిశుధ్యం లోటు లేకుండా తగిన ప్రాంతాలలో వార్డు ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వార్డుల్లో కూడా విద్యుత్ స్తంభాలు ఎక్కడైనా మరమ్మతుకు గురైన వాటిని తొలగించి కొత్తగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వీధి దీపాలు లోటు లేకుండా తగుచర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈ, ఏఈలు, మున్సిపల్ మేనేజర్ మణికంఠ, కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బందులు పాల్గొన్నారు.

శ్రీరామలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడీ మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలలో సంకల్ప సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో అత్యవసర వైద్య సేవలపై(సీపీఆర్) మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రముఖ వైద్యులు డాక్టర్ అనంత్ నాగ్ మాట్లాడుతూ గుండెపోటుకి సంబంధించి కొన్ని ప్రథమచికిత్సా పద్ధతులు ఉన్నాయన్నారు. వాటిని ఎలా చేయాలో విద్యార్థులకు చేసి చూపించారు. ఈ సదస్సులో హాస్పిటల్ మేనేజర్ సుభాష్ మాట్లాడుతూ సంకల్ప హాస్పిటల్ లో అందరికి అందుబాటులో చికిత్స అందిస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ అధిక ఒత్తిడి, నిర్ణీత సమయంలో ఆహారం తీసుకోకపోవడం వల్ల గుండెకి సంబంధించిన వ్యాధులు వస్తున్నాయని, మనం ముందుగా గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ అవగాహన సదస్సులో కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్ కుమార్ రెడ్డి, కన్వీనర్ ఎన్.వాసు, జాతీయ సేవ విభాగం నిర్వాహకుడు ఎస్.చక్రి శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు మంగళం ట్రెండ్స్ ద్యార్థినులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పంచాయతీ లోని గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంగళం ట్రెండ్స్‌కు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయిలోని వివిధ విభాగాలలో క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యా యులు కేశవులు నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణ శిక్షణలో కోకో, కబడ్డీ, యోగా పోటీలలో మండల నియోజకవర్గ స్థాయిలలో, జిల్లా స్థాయిలలో విజేతలుగా నిలిచారన్నారు. జిల్లా స్థాయిలో కోకో క్రీడలో పాల్గొన్న దాదాపు 250 విద్యార్థినులలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన 12 మందిలో తమ పాఠశాల విద్యార్థిని డి.ప్రత్యూష (10)ఉందని, కబడ్డీలో పాల్గొన్న 150 మంది విద్యార్థులలో 12 మంది ఎంపిక కాగా వారిలో టి.మనిషా(10వ) తరగతి విద్యార్థిని, యోగా పోటీలలో 100 మంది విద్యార్థులు పాల్గొనగా ఏడుగురు ఎంపిక కాగా తమ విద్యార్థిని 9వ తరగతి విద్యార్థిని వై.దివ్య ఉందన్నారు. విద్యార్థినులు జనవరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతోపాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థినులను ఉపా ధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్ సుశీల, సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు అభినందించారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ రామకృష్ణ

ప్రజాశక్తి-పాకాల: రానున్న సంక్రాంతి పండుగ నేపథ్యంలో మండలంలో ఎవరైనా జల్లికట్టు, పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ వాతావరణం నెలకొన్న సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అన్నారు. ఎక్కడైనా ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వెంటనే ప్రజలు పాకాల పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచు తామ న్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేడు సీనియర్ పెన్షనర్లకు సన్మానం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం 73 ఏళ్లు నిండిన సీనియర్ పెన్షనర్లను ఘనంగా సత్కరించనున్నట్లు ఆ సంఘం శ్రీకాళహస్తి తాలూకా ప్రధాన కార్యదర్శి బి.వెంకయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక చెంచులక్ష్మి కాలనీ సమీపంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సీనియర్ పెన్షనర్లయిన 80 మందిని ఘనంగా సన్మానిస్తామన్నారు. కార్యక్రమానికి సన్మాన గ్రహీతలు, సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులు హాజరు కావాలని కోరారు.

తూపల్లి శిరీషాకు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి నగరానికి చెందిన తూపల్లి శిరీషాకు కంచి - శ్రీ చంద్ర శేఖర సరస్వతీ విశ్వ మహా విద్యాలయం వారు డాక్టరేట్ ను ప్రదానం చేసినట్లు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని మేనేజ్మెంట్ స్టడీస్ విభాగానికి చెందిన డాక్టర్ వి రామ నాథన్ పర్యవేక్షణలో "పారిశ్రామిక రంగాలలో మహిళలు చేస్తున్న కృషి" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. తూపల్లి శిరీషకు డాక్టరేట్ రావడం పట్ల పలువురు ఆచార్యులు పరిశోధకులు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

'శ్రీనివాస'లో ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - కోట: మండలంలోని విద్యా నగర్‌లో ఉన్న శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరెస్పాండంట్ నీలం.సురేంద్ర రెడ్డి, ఛైర్మన్ చంద్రసేనమ్మ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ముఖ్య అతిథిగా పాస్టర్ శ్యామ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాలు పంపిణీ

ప్రజాశక్తి- బిఎన్‌కండ్రిగ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సపోర్ట్ సంస్థ ద్వారా నడుపుతున్న నిరాశ్రయుల వసతి గృహంలోని నిరాశ్రయులకు సుమారు 50 మందికి బిఎన్‌కండ్రిగ క్రీస్తు సంఘం వారు క్రిస్మస్ సందర్భంగా అందరికీ భోజనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సపోర్ట్ డైరెక్టర్ జోసఫ్ రాజు మాట్లాడుతూ ప్రతి క్రిస్టమస్ పండుగకు బిఎన్‌కండ్రిగ క్రీస్తు సంఘంవారు ఇక్కడి నిరాశ్రయులకు భోజనాలు ఏర్పాటుచేయడం తమకు ఎంతో సంతోషమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సపోర్ట్ సంస్థ డైరెక్టర్ పి. జోసఫ్ రాజు బిఎన్‌కండ్రిగ క్రీస్తు సంఘం సువార్తికులు ఎం. సురేష్‌బాబు, సంఘ సభ్యులు ప్రేం రాజ్ పాల్గొన్నారు.

గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల..

తాత్కాలిక కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాయలసీమ జిల్లాల గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల ఆత్మీయ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు రాజేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా గ్రామ వార్డు సచివాలయం తాత్కాలిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా ఎస్.మస్తానప్ప, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బి.సుమన్ రెడ్డి, కోశాధికారిగా పి.మునికృష్ణయ్య, 17 మందితో తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నామన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి- కోట: మండలంలోని అల్లారెడ్డి శ్యామసుందరపురం మెయిన్ రోడ్డు వద్ద మంగళవారం తెలుగుదేశం పార్టీ కోట ఎంపీటీసీ సభ్యులు షేక్ షంషుదీన్ పుట్టినరోజు సందర్భంగా వీనస్ భాష చారిటబుల్ ట్రస్ట్ వారి ఆర్థిక సాయంతో సమన్వయ సేవాసమితి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పలువురు పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయబ్, భాషేర్, సమన్వయ సేవా సమితి అధ్యక్షురాలు తమటం వెంకట రమణమ్మ, విజయమ్మ, సంస్థసభ్యులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు తప్పెట్లు అందజేత

కోట పట్టణం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ షంషుద్దీన్ జన్మదిన సందర్భంగా వీనస్ భాష చారిటబుల్ ట్రస్ట్ సభ్యులైన నదీమ్ డాక్టర్ జువేరియా ఆర్థిక సాయంతో కోట శ్యామసుందరపురం గ్రామానికి చెందిన 8 మంది డప్పు కళాకారులకు తప్పెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కోట ఎంపీటీసీ షంషుద్దీన్‌ని శ్యామ్ సుందర్ పురం గ్రామస్తులు పూలమాలలు వేసి సన్మానించారు.

ఆనేగొట్టం వీఆర్ఏ మృతి

ప్రజాశక్తి- దొరవారిసత్రం : మండల పరిధిలోని ఆనేగొట్టం రెవెన్యూ సహాయకులు మావిళ్ల చెంగయ్య మంగళవారం మృతి చెందారు. వివరాల మేరకు..చెంగయ్య గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఇతనికి భార్య పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే తహశీల్దార్ గోపిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ప్రభుత్వపరంగా అందించాల్సిన అంత్యక్రియలకు రూ.15వేలను తహశీల్దార్ చేతులు మీదగా మృతుడు కుటుంబానికి అందించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ చెంగయ్య మృతిపట్ల తన సంతాపం తెలుపుతూ అతను ఉద్యోగం పట్ల అతను గ్రామానికి చేసిన సేవలు గురించి కొనియాడారు. ప్రభుత్వ పరంగా కుటుంబానికి రావలసిన లావాదేవీలు అన్ని అందించడం జరుగుతుందని అందుకు తమ రెవెన్యూ యూనియన్ తరపున సహాయ సహకారం అందిస్తామని తెలిపారు.

పంబలేరు వద్ద ఇరుక్కున్న ట్యాంకర్

రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పంబలేరు వద్ద మంగళవారం సాయంత్రం ఓ ట్యాంకర్ ఇరుక్కుపోయింది. ఇక్కడ మాండూస్ తుఫాను వర్షాలకు ఈ మార్గం మట్టితోలి మూసేశారు. గత వారం రోజుల నుండి అతి కష్టంగా అటు ఇటు మోటార్ సైకిల్ మాత్రమే నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఓ ట్యాంకర్ డ్రైవర్ దురుసుగా ఈ మార్గాన్ని చూడకుండా పైకి ట్యాంకర్ ఎక్కించే ప్రయత్నం చేసి ఇరుక్కుపోయాడు. ఫలితంగా ట్యాంకర్ ముందుకు వెనక్కి పోకుండా నిలిచిపోయింది. దీంతో మోటార్ సైకిల్ వెళ్లే వాళ్లకి వచ్చే వాళ్ళకి పెద్ద సంకటంగా మారింది. పాదచారులకు కష్టంగా ఉంది. ఆదిశంకర విద్యార్థులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గం చూడకుండా అనేక కార్లు పంబలేరు వరకు వచ్చి తిరిగి వెళుతున్నాయి. మనుబోలు గూడూరు మధ్య మోటర్ సైకిల్‌కు ఆటోలకు ఈ మార్గం దగ్గరగా అనువుగా ఉంది. ఇపుడు ట్యాంకర్‌ను బయటికి తీసి రోడ్డుపైకి మళ్ళించడం కష్టంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ఈ మార్గం గుండా ట్యాంకర్లు రాకుండా తగుచేర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

పవన్ చిత్తశుద్ధితో సాయం అందిస్తే విమర్శిస్తారా

వైసీపీ మంత్రులపై జనసేన నాయకుల ఫైర్

ప్రజాశక్తి -తిరుపతి (మంగళం): రాష్ట్రంలో కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుని చనిపోతే సాయం అందించాల్సిన మంత్రులే అందులో వాటాలు అడగడం సమంజసమేనానని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ మంత్రి అంబటి రాంబాబు వాటా తంతు వీడియో సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోందని, ఇప్పుడు మంత్రి రాంబాబు రాజీనామాకు సిద్ధమేనా అన్నారు. పవన్ కళ్యాణ్‌ను పని కట్టుకొని విమర్శిస్తున్న మంత్రి రోజా రాబోవు 2024 ఎన్నికల్లో నగిరి నియోజకవర్గం నుండి గెలిస్తే తాను రోజా ఇంటి ముందే గుండు గీయించుకుంటానని సవాలు విసిరారు. పవన్‌ను విమర్శించే వైసీపీ ఎమ్మెల్యేలు వారాహి వాహనం కింద నలిగి పోతారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు రాజారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి, హేమ కుమార్, సుమన్ బాబు, మునస్వామి, రాజమోహన్, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అంబటి రాజీనామా చేయాలి

శ్రీకాళహస్తి: సత్తెనపల్లి కౌలు రైతు భరోసా సభలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన ఆరోపణలు నిజమని నిరూపిస్తే రాజీనామా చేస్తానని మంత్రి అంబటి రాంబాబు ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారనీ, ఇప్పుడు స్వయంగా బాధితులే ముందుకు వచ్చి చెబుతున్న నేపథ్యంలో తక్షణమే పదవికి రాజీనామా చేయాలని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ డిమాండ్ చేశారు.

వైశ్యుల్లో రాజకీయ చైతన్యం కల్పిస్తాం

టిటిడి బోర్డు సభ్యులు ముర్రంశెట్టి రాములు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దక్షిణాదిలో ఉన్న వైశ్యుల్లో రాజకీయ చైతన్యం కల్పించడానికి శ్రీకారం చుట్టామని ఇందుకుగాను సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్‌ను ఏర్పాటు చేశామని పరిషత్ అధ్యక్షులు, టిటిడి బోర్డు సభ్యులు ముర్రంశెట్టి రాములు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఏడు అంశాలుగా వైశ్యుల్లో చైతన్యం తీసుకువచ్చి అందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకునేలా కార్యచరణను చేపట్టమన్నారు. వైశ్య సామాజిక స్థితిగతులను తెలుసుకోవడానికి సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ ప్రణాళిక వద్దగా పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ లోగోను ఆవిష్కరించారు. పరిషత్ కార్యదర్శి బచ్చు శ్రీనివాస్, దక్షిణాది రాష్ట్రాల పరిషత్ అధ్యక్షులు, పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి..రక్షణ పొందండి..

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం): స్థానిక బైరాగిపట్టెడలోని శ్రీచైతన్య స్కూల్ ఐపీఎల్ బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ డిఎస్‌పి కాటమరాజు, విజయ్ శేఖర్, ఎస్ఐ నరసింహులు, సంజీవ్ కుమార్, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సురేష్ పాల్గొన్నారు. డీఎస్పీ కాటమరాజు మాట్లాడుతూ అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, హెల్మెట్ ధరించాలని,18 సంవత్సరాల లోపు పిల్లలు డ్రైవింగ్ చేయరాదని, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ప్రాణాలు రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు పలు రకాల రోడ్డు నియమాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ అన్నపూర్ణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ బాలాజీ, ఏవో రవి బాబు, డీన్, ఐపిఎల్ ఇన్‌చార్జ్, సిబ్యాచ్ ఇన్‌చార్జ్, సివిల్స్ ఇన్‌చార్జ్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

'వైసీపీని ఇంటికి పంపండి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రజలను ఖర్మ లాగా పట్టి పీడిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు అన్నారు. పట్టణంలోని 13వ వార్డులో మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ మూడేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు వరగపెట్టింది ఏమీ లేదన్నారు. రాష్ట్రాన్ని, ప్రజలను అప్పుల పాలు చేసిన ఘనత జగన్ కే తగ్గుతుందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల పేరిట జగన్ ప్రభుత్వం ప్రజల్ని మోసం చేస్తోందనీ, ప్రజలు నమ్మొద్దని పిలుపునిచ్చారు. రేణుకా దేవి, రవి, కాసరం రమేష్, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తిరుపతి IV అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జివారి కోర్టులో

G.W.O.P.No. 360 of 2022

1) మైనర్ బి.గురుచరణ్ } 1, 2 మైనర్లకు గార్డియన్
2) మైనర్ వేదశ్రీ } తల్లి బి.సుమలత భర్త లేట్ రాజ్‌కుమార్

అందరి నివాసము డి.నెం.6-1-206, వరదరాజనగర్, తిరుపతి టవున్ ...పిటిషనర్లు

మరియు

నిల్ ...రెస్పాండెంట్

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా 10.01.2022వ తేది చనిపోయిన లేట్ బాల్యరాజ్‌కుమార్ గారికి 1వ పిటిషనరు కుమారుడు గాను 2వ పిటిషనరు కుమార్తె గాను, బాల్యసుమలత గారు భార్యగాను వుంటున్నారు. సదరు బి.రాజ్‌కుమార్ గారు బ్రతికి వున్నప్పుడు అతనికి అన్నగారైన బాల్య హరికుమార్ గారు 22.07.2017వ తేది పై పిటిషనులోని షెడ్యూలును దాన సెటిల్‌మెంటు దస్తావేజు నెం.4019 ఆఫ్ 2017 ద్వారా ఇచ్చియున్నారు. అది మొదలుకొని సదరు షెడ్యూలును లేట్ బి.రాజ్‌కుమార్ గారు స్వాధీనములో వుంచికొని అనుభవించుకొను చుండినాడు. సదరు షెడ్యూలును ప్రస్తుతము పై పిటిషనర్ల స్వాధీనములో వున్నది. సదరు పిటిషను షెడ్యూలు ద్వారా ఎటువంటి ఆదాయము లేదు. సదరు మైనరు పిటిషనర్లు ఇద్దరు భారతీయ విద్యాభవన్, శ్రీ వెంకటేశ్వర విద్యాలయము, తిరుపతి శాఖ నందు చదువుకొనుచున్నారు. సదరు 1, 2 మైనర్లకు చదువులు చెప్పించుటకు, ఫీజులు కట్టుటకు, నిత్యావసరములు తీర్చుటకు పైకము కావలసివున్నది. సదరు షెడ్యూలుపై ఎటువంటి ఆదాయము లేనందున పిల్లల చదువు చెప్పించుట మరియు 1, 2 పిటిషనర్లను పోషించుట చాలా కష్టముగా వున్నది. సదరు షెడ్యూలును 1, 2 మైనర్ పిటిషనర్ల తరపున ఎవరికైనను అమ్మివేసి, అమ్మగా వచ్చినపైకమును ఏదేని నేషనల్ బ్యాంకులో జమచేసి, సదరు పైకమునకు వచ్చిన వడ్డీ పైకముతో 1, 2 మైనరు పిటిషనర్లును చదివించవలసి యున్నది. అందు నిమిత్తము సదరు 1, 2 మైనర్లకు నేచురల్ గార్డియన్ తల్లి బి.సుమలత గారిని గార్డియన్ గారి నియమించుటకు, మరియు మైనర్ల అయిన 1, 2 పిటిషనర్ల తరపున పిటిషను షెడ్యూలు అమ్మి వేయుటకు గాను పై గార్డియన్ ఓపిని దాఖలు పరచియున్నారు. సదరు ఓ.పి.నందు 1,2 మైనర్లకు గార్డియన్‌గా, తల్లిగారైన సుమలతను అపాయింట్ చేసి, సదరు పిటిషను షెడ్యూలు ఎవరికైనను మైనర్ల తరపున అమ్మివేయుటలో ఏవరికైనను ఎలాంటి అభ్యంతరములు వున్నయెడల పై కోర్టుకు 23.01.2023 వ తేది ఉదయము 10.30 గం॥లకు నేరులోనైనను, వకీలు ద్వారా అయినను హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా: 23.01.2023

కట్టమంచి రమణయ్య, ఎ.సుబ్రమణ్యం

పిటిషనర్ల తరపు న్యాయవాదులు, తిరుపతి